
పొన్నాడ కేజీబీవీలో శతశాతం ఉత్తీర్ణత

ఎచ్చెర్ల, ఏప్రిల్ 12: ఎచ్చెర్ల మండలం పొన్నాడ కేజీబీవీలో ఇంటర్మీడియట్‌లో శతశాతం ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎం.సూర్యకళ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 33 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. అందరూ ఉతీర్ణులయ్యారన్నారు. ఇందులో కె.పూజిత 456 మార్కులు సాధించినట్టు చెప్పారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 35 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. వారంతా ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఎస్.హారిక 970 మార్కులు సాధించినట్టు చెప్పారు.



15న జిల్లాకు చంద్రబాబు రాక

- ప్రజాగళం పేరిట పలాస, టెక్కలిలో సభల నిర్వహణకు ఏర్పాట్లు

శ్రీకాకుళం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేడి ఆరంభమవుతోంది. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 'ప్రజాగళం' పేరిట సభలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాకు ఈనెల 15న వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అదే రోజున ముందుగా రాజాంలో సభ నిర్వహిస్తారు. అనంతరం టెక్కలి, పలాస ప్రాంతాల్లో సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ మేరకు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఆరంభమయ్యాయి.

● 24న జగన్...

ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జిల్లాకు ఈనెల 24న వస్తున్నారు. ఎన్నికల ప్రచారం నేపథ్యంలో భాగంగా చేపడుతున్న బస్సుయాత్రను 24న టెక్కలిలో ముగిస్తున్నారు. శ్రీకాకుళంలో శుక్రవారం నిర్వహించిన వైసీపీ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ వైవీ సుబ్బారెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు.

ఇంటర్‌లో 24వ స్థానం

- మొదటి సంవత్సరంలో 21వ స్థానం
- రెండింటిలోనూ బాలికలదే హవా
- ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు అధ్వానం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఎప్పటిలానే ఇంటర్మీడియట్ ఫలితాల్లో బాలికలే సత్తా చాటారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంతో పాటు ఒకేషనల్‌లో కూడా వారిదే హవా. ఈ ఏడాది ఎన్నికల కారణంగా.. ఇంటర్, ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఒకేసారి శుక్రవారం విడుదల చేశారు. రాష్ట్రస్థాయిలో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో జిల్లాకు 21వ స్థానం లభించింది. సెకెండ్ ఇయర్‌లో 24వ స్థానం లభించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫలితాలు ఆశించినస్థాయిలో లేవు. అత్యధిక కళాశాలల్లో అధ్వానంగానే ఉత్తీర్ణత లభించింది.



ఇంటర్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

35 శాతంలోపు ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ కళాశాలలు ఇవే

కళాశాల	ప్రథమ సంవత్సరం		ద్వితీయ సంవత్సరం	
	హాజరైనవారు	ఉత్తీర్ణత శాతం	హాజరైనవారు	ఉత్తీర్ణత శాతం
శ్రీకాకుళం జీజేసీ (బాయ్స్)	368	30.98		
ఎచ్చెర్ల జీజేసీ	64	7.81	82	8.54
కింతలి జీజేసీ	64	34.38		
నందిగాం జీజేసీ	58	27.59		
పూండి ఆర్ఎస్ జీజేసీ	100	25.00		
రణస్థలం జీజేసీ	49	12.24	57	29.82
జి.సిగడాం జీజేసీ	113	12.39	91	34.07
కళింగపట్నం జీజేసీ	86	15.12	80	21.25
ఇచ్ఛాపురం జీజేసీ (బాయ్స్)	102	32.35		
పాతపట్నం జీజేసీ	226	34.96		
కొత్తూరు జీజేసీ	139	31.65		
ఎల్.ఎన్.పేట జీజేసీ	58	32.76		
ప్రియాగ్రహారం జీజేసీ	59	22.03		
పోలాకి జీజేసీ	72	15.28		

● ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 18,249 మంది విద్యార్థులు హాజరవ్వగా... 10,408 మంది ఉత్తీర్ణులయ్యారు. 57శాతం ఉత్తీర్ణత లభించింది. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 21వ స్థానం లభించింది. బాలురు 7,999 మంది హాజరు కాగా.. 3,947 మంది(49 శాతం) ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 10,250 మంది హాజరు కాగా.. 6,461 మంది (63శాతం) పాస్ అయ్యారు.

● ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 16,769 మంది విద్యార్థులు హాజరుకాగా 11,300 మంది ఉత్తీర్ణులయ్యారు. 67 శాతం ఉత్తీర్ణత లభించింది. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 24వ స్థానం లభించింది. 7,407 బాలురు పరీక్షలకు హాజరు కాగా.. 4,451 మంది(60 శాతం) మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. బాలికల విషయానికొస్తే.. 9,362 మంది హాజరవ్వగా 6,849 మంది(73శాతం) పాస్ అయ్యారు.

ఒకేషనల్ కోర్సుల్లో...

● ఒకేషనల్ విభాగానికి సంబంధించి ప్రథమ సంవత్సరంలో 490 మంది బాలురు హాజరవ్వగా 219 మంది ఉత్తీర్ణులయ్యారు. 45 శాతం ఉత్తీర్ణత లభించింది. బాలికలు 613 మంది హాజరవ్వగా 511 మంది ఉత్తీర్ణులయ్యారు. 83 శాతం ఉత్తీర్ణత లభించింది.

● ద్వితీయ సంవత్సరంలో.. 435 బాలురు హాజరవ్వగా 244 మంది ఉత్తీర్ణులయ్యారు. 56 శాతం ఉత్తీర్ణత లభించింది. 643 మంది బాలికలు హాజరు కాగా.. 553 మంది ఉత్తీర్ణులయ్యారు. 86 శాతం ఉత్తీర్ణత లభించింది.

● ప్రభుత్వ కళాశాలల్లో అధ్వాన ఫలితాలు

ఈ ఏడాది అత్యధిక ప్రభుత్వ కళాశాలల్లో అధ్వానంగా ఉత్తీర్ణత శాతం లభించింది. ఏపీ సోషల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కళాశాలల నుంచి ఇంటర్ సెకెండ్ ఇయర్ పరీక్షలకు 96మంది హాజరయ్యారు. 54మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 42 మంది పరీక్ష తప్పారు. ఫస్ట్‌ఇయర్ పరీక్షలకు 160 మంది హాజరవ్వగా 61 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 99 మంది పరీక్షలు తప్పారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫలితాలు చాలా తీసికట్టుగా ఉన్నాయి. ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఈ ఏడాది 64 మంది ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్ష రాయగా.. 5 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. కేవలం 7.81 శాతం ఉత్తీర్ణత లభించింది. సెకెండ్ ఇయర్‌కుగాను 82మంది పరీక్ష రాయగా ఏడుగురు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. కేవలం 8.54 శాతం ఉత్తీర్ణత లభించింది. జిల్లాలో ఇలాంటి కళాశాలలు చాలానే ఉన్నాయి.



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

మే 5 నుంచి ఇంటి వద్దే ఓటు

- దివ్యాంగులు, 85ఏళ్లు దాటిన వారికి..
- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఏప్రిల్ 12: ఇంటి నుంచే ఓటు వేసే ప్రక్రియ(హోమ్ ఓటింగ్)కు సంబంధించి 85 సంవత్సరాలు పైబడిన, అలాగే దివ్యాంగ ఓటర్ల వివరాలను ఆయా ఆర్వోలకు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ తెలిపారు. శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో ఆర్వోలు, ఏఆర్వో(తహసీల్దార్లు), సెక్టార్ అధికారులు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'ఏ ఒక్కరూ ఓటు వేయలేకపోయామని బాధపడే పరిస్థితి ఉండకూడదన్నదే ప్రధాన ఉద్దేశం. వచ్చే నెల 5నుంచి 8వ తేదీ వరకు నాలుగు రోజులపాటు జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా హోం ఓటింగ్ ప్రక్రియ జరుగుతుంది. శనివారం నాటికి అర్హుల జాబితా తయారవుతుంది. ఈ నెల 15, 16, 17 తేదీల్లో బీఎల్వోలు 12-డి దరఖాస్తులను తీసుకుని స్వయంగా ఆయా ఓటర్ల వద్దకు వెళ్లి అందజేయాలి. ఆ దరఖాస్తులను ఈ నెల 22 నాటికి బీఎల్వోలు, సెక్టార్ అధికారులు సంయుక్తంగా వెళ్లి ధ్రువీకరణ పత్రాలను స్వీకరించాలి. హోం ఓటింగ్ కావాలో వద్దో అన్న హామీ పత్రాలను తీసుకోవాలి. వీటిపై ఆర్వో కార్యాలయానికి నివేదిక అందజేయాలి. అర్హులందరికీ ఇంటి వద్దనే మే 5 నుంచి 8 వరకు ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తామ'ని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవీన్, జడ్పీ సీఈవో డి.వేంకటేశ్వరరావు, డ్వామా పీడీ చిట్టిరాజు, సమన్వయకర్తలు బాలాజీ నాయక్, ఎం.కిరణ్‌కుమార్, ఈడీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన అధికారులు

టీడీపీ వైపు వలంటీర్ల చూపు

- అచ్చెన్న సమక్షంలో ఇద్దరు చేరిక

టెక్కలి, ఏప్రిల్ 12: 'ఐదేళ్ల పాటు గొడ్డు సేవ చేశాం. కనీసం గౌరవవేతనాలు కూడా పెంచలేదు. మాకు ఇచ్చిన 50 ఇళ్ల పరిధిలో వలంటీర్‌గా సేవలు అందిస్తూనే సచివాలయ సిబ్బంది ఏ పని చెప్పినా ఎస్.. బాస్ అంటూ తలలూపాం. చివరికి ఇప్పుడేమో రాజీనామా చేయండి అంటూ వైసీపీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారు' అని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకు రాజీనామా చేయాలని అడిగితే.. తర్వాత చెబుతాం.. ముందు చెప్పింది చేయండి అంటూ హుకుం జారీ చేస్తున్నారని వాపోతున్నారు. ఈ క్రమంలో చాలామంది వలంటీర్లు వైసీపీ నేతల తీరుపై విసిగి.. టీడీపీ వైపు చూస్తున్నారు. శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో ఇద్దరు వలంటీర్లు టీడీపీలో చేరారు. కోటబొమ్మాళి మండలం చిట్టయ్యవలస పంచాయతీ తులసిపేట ఎస్సీ కాలనీలో అచ్చెన్నాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ నేపథ్యంలో తోట సింహాచలం, పట్ట కాశీపతి అనే ఇద్దరు వలంటీర్లు రాజీనామా చేసి టీడీపీలో చేరిపోయారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి నాడు ప్రజాసేవలని చెప్పి.. నేడు పార్టీకి సేవలందించమని కోరుతున్నారని, ఇదెక్కడి న్యాయమని ఆ వలంటీర్లు అచ్చెన్న వద్ద వాపోయారు. ఐదేళ్లు వెట్టిచాకిరీ చేసినా.. వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు వలంటీర్‌కు గౌరవ వేతనం రూ.10వేలు ఇస్తామని ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. కాగా.. రానున్నది ఎన్డీఏ కూటమని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామని అధైర్యపడొద్దని అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.



అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన వలంటీర్లు సింహాచలం, కాశీపతి


22న అచ్చెన్న నామినేషన్

టెక్కలి నియోజకవర్గ ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 22న నామినేషన్ వేయనున్నారు. ఈ మేర కు అనుచరులు ఏర్పాట్లు చేస్తున్నారు. అచ్చెన్న 22న నిమ్మాడ నుంచి కోటబొమ్మాళి చేరుకొని కొత్తమ్మతల్లి ప్రాంగణం వద్ద పూజలు చేస్తారు. అనంతరం టెక్కలి సమీపంలోని జగతిమెట్ట నుంచి భారీ ఊరేగింపుగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకోనున్నారు. ఆ రోజు ఉదయం 10.40గంటలకు నామినేషన్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఊరేగింపు ర్యాలీలో నియోజకవర్గ పరిధిలోని టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన వేలాదిమంది కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

రాజీనామా చేయకపోతే.. సచివాలయం గేటు తాకలేరు

- వలంటీర్లకు వైసీపీ నేతల హెచ్చరిక

మెళియాపుట్టి, ఏప్రిల్ 12: ఎన్నికల వేళ.. రాజీనామా చేయాలంటూ వలంటీర్లపై వైసీపీ నేతలు ఒత్తిడి పెంచుతున్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తే వలంటీర్లకు నెలకు రూ.10వేలు జీతం ఇస్తామని ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో చాలామంది వలంటీర్లు రాజీనామా చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. కాగా కొంతమంది వైసీపీ నేతలు వారిని బెదిరించి రాజీనామాలు చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మెళియాపుట్టి మండలంలోని వైసీపీ ముఖ్యనాయకుడు ఒకరు వాట్సాప్‌లో వలంటీర్లకు హెచ్చరిక మాదిరి సందేశాన్ని పంపారు. "ముఖ్యమంత్రి జగనన్న.. స్థానిక ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి వలంటీర్లను సొంత మనుషుల్లా చూసుకుని ఒక గొప్ప అవకాశం కల్పించారు. మీరు కృతజ్ఞతలు చూపించటానికి ఇంత కంటే గొప్ప అవకాశం రాదు. దయచేసి రేపటిలోగా రాజీనామా చేయాలి. లేదంటే మీ అందర్నీ టీడీపీ కోవర్టుల్లా చూస్తాం. పైగా రేపు మళ్లీ మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎందరు చెప్పినా.. కనీసం సచివాలయం గేట్ కూడా తాకలేరు. అర్థం చేసుకొని అర్థం చేసుకుని మీరంతా స్వచ్ఛందంగా రాజీనామా చేయండి' అని ఆ మేసేజ్ ద్వారా వలంటీర్లకు స్పష్టం చేశారు. అయినా కొంతమంది వలంటీర్లు స్పందించకపోవడంతో వైసీపీ నేతలు పునరాలోచనలో పడుతున్నారు.



వలంటీర్లకు వైసీపీ నేత పంపిన మేసేజ్

అంగన్‌వాడీలకు నిరాశే

- పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చని జగన్
- నిరవధిక సమ్మె చేసినా పట్టించుకోని వైనం

(ఇచ్ఛాపురం)

వైసీపీ పాలనలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు నిరాశే మిగిలింది. గత ఎన్నికల ముందు వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో వారికి ఇచ్చిన హామీలను.. అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారు. ప్రధానంగా తెలంగాణలోని అంగన్‌వాడీ సిబ్బంది కన్నా ఎక్కువ వేతనం చెల్లిస్తామని, ఇతర సమస్యలను కూడా పరిష్కరిస్తామని జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కసారి మాత్రమే రూ.వెయ్యి వేతనాన్ని పెంచారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలంటూ అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేపట్టినా ఫలితం లేకపోయింది.

జిల్లాలోని 15 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 3,358 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 3,358 మంది చొప్పున కార్యకర్తలు, ఆయాలు పని చేస్తున్నారు. ఒక్కో కార్యకర్తకు రూ.11,500, ఆయాకు రూ.7వేలు చొప్పున ప్రభుత్వం వేతనం చెల్లిస్తోంది. కాగా.. తెలంగాణలో మాత్రం అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.13,500, ఆయాకు రూ.9వేలు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాదయాత్ర సమయంలో జగన్ ఇచ్చిన హామీ మేరకు తమ వేతనాలు కూడా పెంచాలని అంగన్‌వాడీ కార్యకర్తలు గతేడాది డిసెంబరు 12 నుంచి ఈ ఏడాది జనవరి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టారు. 11 డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేశారు. ఎస్మా చట్టానికి కూడా బెదరకుండా సమ్మె చేపట్టారు. ఉద్యోగాలను తొలగిస్తామని బెదిరించినా వెనక్కి తగ్గలేదు. చివరకు ప్రభుత్వం దిగొచ్చి సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారంతా సమ్మె విరమించి విధుల్లో చేరారు. కానీ ఇంతవరకూ తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టలేదని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వేతన పెంపు, మినీ కార్యకర్తలను మెయిన్ కార్యకర్తలుగా మార్పు, సంక్షేమ పథకాల వర్తింపు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ తదితర డిమాండ్లపై ప్రభుత్వం స్పందించడం లేదని వాపోతున్నారు. సమ్మె కాలానికి వేతనాలు చెల్లిస్తామన్న హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ రావడంతో.. ఇక సమస్యలు పరిష్కారం కానట్లేనని.. తమను వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని మండిపడుతున్నారు.



ఇచ్ఛాపురంలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన (ఫైల్)

మర పడవల్లో చేపల వేట నిషేధం

- మత్స్యశాఖ ఉపసంచాలకుడు శ్రీనివాసరావు

కలెక్టరేట్, ఏప్రిల్ 12: రాష్ట్ర ప్రాదేశిక సముద్ర జలాల్లో మర పడవల్లో అన్ని రకాల చేపల వేటను ఈ నెల 15 నుంచి జూన్ 16 వరకు నిషేధించినట్లు మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంప్రదాయ పడవలు, తెడ్డు, తెరచాప పడవలు(ఇంజిన్ లేని) వారికి వేట నిషేధం నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. ప్రధానంగా వివిధ చేపలు, రొయ్యల జాతులు సంతానోత్పత్తి కాలంలో తల్లి చేపలు, రొయ్యలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం ద్వారా సముద్ర మత్స్య సంపదను కాపాడటమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వేట నిషేధ సమయంలో చట్టాన్ని అతిక్రమించే వారు శిక్షార్హులని, వారికి ప్రభుత్వం ద్వారా వచ్చే ఇతర సంక్షేమ పథకాల నిలుపుదల చేస్తామని తెలిపారు. జరిమానా విధింపుతోపాటు డీజిల్‌పై రాయితీ తొలగిస్తామన్నారు. వేట నిషేధ కాలాన్ని కచ్చితంగా అమలు చేయడానికి మత్స్యశాఖ, కోస్ట్‌గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ అధికారులతో గస్తీ ఏర్పాటు చేశామన్నారు. మత్స్యకారులందరూ సహకరించాలని కోరారు.

మూలపేటలో ఉద్రిక్తత

- ఉపాధిహామీ పనులు అడ్డుకున్న పోర్టు అధికారులు
- సొసైటీ భూములు పోర్టుకు ఎవరిచ్చారంటూ గ్రామస్థుల నిలదీత
- పరిహారం ఎవరికిచ్చారో చెప్పాలని డిమాండ్

సంతబొమ్మాళి, ఏప్రిల్ 12: సంతబొమ్మాళి మండలం మూలపేటలో ఉపాధిహామీ పనులను పోర్టు యాజమాన్యం అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారితీసింది. గత రెండు రోజుల నుంచి మూలపేట పెద్దచెరువులో గ్రామస్థులు ఉపాధిహామీ పనులు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం కూడా వేతనదారులు పనులకు వెళ్లారు. కాగా.. 'ఇది పోర్టుకు సంబంధించిన స్థలం. ప్రభుత్వం మాకు అప్పగించింది. ఈ భూముల్లో ఉపాధి పనులు చేయకూడదు' అని పోర్టు అధికారులు చెప్పారు. దీంతో వాగ్వాదం చోటుచేసుకుంది. మూలపేట మహిళలు, యువకులు, గ్రామస్థులు చెరువు వద్దకు చేరుకుని పోర్టు వాహనాలను అడ్డుకున్నారు. తరతరాలుగా 80ఎకరాల సొసైటీ భూముల్లో ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని.. ఎటువంటి సమాచారం లేకుండా ఉపాధి పనులు నిలుపుదల చేయడం సరికాదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్టపరిహారం చెల్లించామని చెబుతున్న పోర్టు యాజమాన్యం ఎవరి ఖాతాల్లో ఆ డబ్బులు వేశారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పోర్టు ఏర్పాటుకు భూములిచ్చామని, ఇప్పుడు భూములు కోల్పోయి ఉపాధి లేకుండా పోయిందని.. ఎలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. పోర్టుకు తాము వ్యతిరేకం కాదని ఉపాధి పనులు ఆపడం ఎంతవరకు సబబు అని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద చెరువులో ఉపాధి పనుల కోసం రూ.20లక్షలు కేటాయించారని తెలిపారు. రెండు రోజులుగా పనులు చేసి ఇప్పుడు అడ్డుకోవడం వెనుక మర్మమేమిటో చెప్పాలని నిలదీశారు. ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. నౌపడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. ఇరువర్గాలతో మాట్లాడి పరిస్థితి చక్కదిద్దారు. అనంతరం వాహనాలను పంపించారు.



పోర్టు వాహనాలను అడ్డుకున్న మూలపేట గ్రామస్థులు

రహ'దారుణాలు'

● గోతులమయమైన రోడ్లు ● రాళ్లు తేలి ప్రమాదాల బారిన ప్రజలు



కేఎల్ఎన్‌పేట వద్ద గోతులమయంగా తయారైన తలతరియా రోడ్డు

(జలుమూరు)

మండలంలోని పలు గ్రామాల రహదారులు నరకాన్ని తలపిస్తు న్నాయి. ఏ గ్రామ రహదారి చూసినా గోతులమయంగా, రాళ్లతేలి కనిపిస్తున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్ల నిర్వహణ లేకపోవడంతో దారుణంగా తయారయ్యాయి. రోడ్లన్నీ అధ్వానంగా ఉండడంతో తరచూ వాహనాలు బోల్తా కొట్టడంతో పాటు వాహనదారులు గాయాలబారిన పడుతున్నారు. పలు రోడ్లపై కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలులేని విధంగా తయారయ్యాయి. అబ్బాయిపేట నుంచి లింగాలపాడు వరకు గత టీడీపీ హయాంలో రోడ్డు వేశారు. ఆ తరువాత ప్రభుత్వం మారగా ఒక తట్టి మట్టి కూడా వేసిన సందర్భం లేదు. దీంతో రోడ్డంతా గోతులమయమై ప్రయాణించేందుకు వాహనదారులు భయపడుతున్నారు. జలుమూరు నుంచి వెంకటాపురం మీదుగా సుబ్రమణ్యపురం, బుడితి వరకు టీడీపీ ప్రభుత్వంలో బీటీ రోడ్డు నిర్మాణనికి నిధులు మంజూరు చేయగా సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వంలో మిగిలిన పనులు పూర్తి చేయక పోవడంతో ఆ రోడ్డుపై బాటసారులు సైతం నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఈ మార్గంలో సుమారు 10 గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. జోనంకి నుంచి కృష్ణాపురం వరకు, అందవరం నుంచి పర్లాం రోడ్డు, తిమడాం నుంచి మాకివలస తదితర రోడ్లు దారుణంగా ఉన్నాయి. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలను నివారించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



జలుమూరు వద్ద రాళ్లు తేలిన వెంకటాపురం రోడ్డు

13 రోజుల తర్వాత జనంలోకి అచ్చెన్న



జయకృష్ణాపురంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో అచ్చెన్నాయుడు

టెక్కలి, ఏప్రిల్ 12: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి కళావతి ఇటీవల మృతి చెందడంతో ఎన్నికల ప్రచారానికి 12 రోజుల పాటు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. శుక్రవారం నిమ్మాడలో భార్య విజయమాధవి హారతులివ్వగా చిట్టయ్యవలస పంచాయతీ తులసిపేట ప్రాంతంలో ముఖ్య నేతలతో కలిసి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనను అంతం చేసే రోజులు దగ్గరపడ్డాయని, ఈ ప్రభుత్వానికి ఇవే చివరి ఎన్నికలన్నారు. వైసీపీని బంగాళాఖాతంలో కలపాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కింజరాపు ప్రసాద్, బోయిన గోవిందరాజులు, పూజారి శైలజ, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, కూన అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి 200 కుటుంబాలు టీడీపీలో చేరిక

టెక్కలి: తొలుసూరుపల్లి పంచాయతీ జయకృష్ణాపురం, టెక్కలి ఎన్టీఆర్ కాలనీ నుంచి వైసీపీకి చెందిన 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే తొలుసూరుపల్లి పంచాయతీ ధర్మనీలాపురం, జయకృష్ణాపురం, మున్సబుపేట గ్రామాల్లో అచ్చెన్నాయుడు ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేసిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. ఇసుకను ఐదేళ్ల పాటు జగన్ యదేచ్ఛగా దోపిడీ చేశారని, భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టాడని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, నాయకులు ఎల్ఎల్ నాయుడు, పినకాన అజయ్‌కుమార్, బీజేపీ ఇన్‌చార్జ్ అట్టాడ రవిబాబ్జీ, జనసేన ఇన్‌చార్జ్ కణితి కిరణ్‌కుమార్, వంజంగి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

జలుమూరు: నరసన్నపేట నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా నాలుగు పర్యాయాలు ఎన్నికైన కృష్ణదాస్ ఏం చేశారో చెప్పాలని నరసన్నపేట ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి ప్రశ్నించారు. యలమంచిలిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లవానిపేట సొసైటీ మాజీ అధ్యక్షుడు వాన కనకయ్యతో పాటు ఉప సర్పంచ్ కొర్ను జగ్గారావు, 10 మంది వార్డు సభ్యులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి రమణమూర్తి కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీటీసీలు వాన శ్రీనివాసరావు, చెంచలి కామేశ్వరరావు, మాజీ సర్పంచ్ పట్ట కృష్ణారావు తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, పార్టీ మండల వెలమల రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే సారవకోట మండలం గోవర్ధనపురం పంచాయతీ అర్లి, గోవర్ధనపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు సురవరపు తిరుపతిరావు, భైరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. పాగోడు గ్రామంలో రమణమూర్తి సతీమణి బగ్గు సుగుణమ్మ, పోలాకి మండలం సాగరతీర గ్రామాల్లో ఆయన తనయుడు సునీల్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరసన్నపేటలో బగ్గు అర్చన ప్రచారం చేశారు.



కండువాలు వేసి వైసీపీ నేతలను ఆహ్వానిస్తున్న టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి

నియోజకవర్గానికి చేరిన ఎన్నికల సామగ్రి

నరసన్నపేట: నియోజకవర్గంలోని 290 పోలింగ్ కేంద్రాలకు చెందిన ఎన్నికల సామగ్రి శుక్రవారం వచ్చినట్లు ఆర్వో జీవీజీ రామ్మోహన్ రావు తెలిపారు. 290 పోలింగ్ కేంద్రాల అసెంబ్లీ, లోక్‌సభ పోలింగ్‌కు కావాల్సిన ఫర్నిచర్, స్టేషనరీని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచామన్నారు. ఎన్నికల డ్యూటీలో ఉన్న అధికారులు సెలవులు తీసుకోరాదని ఆర్వో స్పష్టం చేశారు.



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న ఆర్వో

ముమ్మరంగా తనిఖీలు

నరసన్నపేట: స్థానిక మడపాం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు చేస్తున్నామని ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. గ్రామాల్లో మద్యం నిల్వలుంటే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఏఎస్ఐ అశిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

సంతబొమ్మాళి: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, పీఏసీఎస్ మాజీ ఛైర్మన్ అట్టాడ రాం ప్రసాద్ అన్నారు. శుక్రవారం పెద్దమర్రిపాడులో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కలిగించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా అచ్చెన్నాయుడు, ఎంపీగా రామ్మోహన్‌నాయుడును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సూరాడ ధనరాజ్, కర్రి రామిరెడ్డి, సువ్వారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● **కాశీబుగ్గ:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వచ్చేది కూటమి ప్రభుత్వమేనని టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ చినబడాంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎమ్మెల్యేగా గౌతు శిరీష, ఎంపీగా రామ్మోహన్‌నాయుడులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణ, యుగంధర్, తిరుముల తదితరులు పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని హూండి క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చ ఈశ్వరరావు, నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు పుచ్చ శోభారాణి అన్నారు. శుక్రవారం సైనూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీషను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కర్ని రమణ, గొరకల వసంతరావు పాల్గొన్నారు.

ప్రతాప విశ్వనాథపురంలో వైద్య శిబిరం

నందిగాం: ప్రతాపవిశ్వనాథపురంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 'విష జ్వరాలు విజృంభణ' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం వచ్చిన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి రెల్ల సుకన్య గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి రోగులను పరీక్షించారు. అలాగే డీఎల్పీవో ఐవీ రమణ, ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ రాజారావు గ్రామాన్ని సందర్శించి జ్వరాల పరిస్థితిపై ఆరా తీశారు. గ్రామంలో జ్వరాలు తగ్గుముఖం పట్టే వరకు శిబిరం కొనసాగించాలని సూచించారు. అలాగే పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు తాగునీటి బావుల ఆవరణలో క్లోరినేషన్ చేపట్టలని సిబ్బందికి సూచించారు.

ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ



సవర నిహారిక(982)

పలాస, ఏప్రిల్ 12: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపీసీలో సవర నిహారిక 982, బెహరా పార్వతి 920, ఎంపీసీలో బెహరా గాయత్రి 966, సవర రాజు, బెహరా దీప 951, నాయక్ సౌమ్యా 931, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లో ఎస్.సంజీత్‌కుమార్ 921, ఎం.సీలిమ 902 మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ కె.నర్సింహమూర్తి, అధ్యాపకులు అభినందించారు.

● **వజ్రపుకొత్తూరు:** ఇంటర్ పరీక్షల్లో గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ కె.రమేష్ పట్నాయక్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో చింత జాన్సీ 905 మార్కులు సాధించిందన్నారు. అలాగే మిగిలిన గ్రూపుల్లోనే మంచి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

● **టెక్కలి:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో పలువులు విద్యార్థులు రాణించారని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి కె.ప్రకాశరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మనోజ్‌కుమార్ గౌడో ఎంపీసీ (948), జిత్తు శ్రవంతి (బైపీసీ) 962, నాగేశ్వరి రష్మిత బెహరా 981 (ఒకేషనల్) మార్కులు వచ్చాయన్నారు. వీరిని డీవీఈవో, అధ్యాపకులు అభినందించారు.

● **నరసన్నపేట:** ఇంటర్ ఫలితాల్లో నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాణించారు. ద్వితీయ సంవత్సరంలో ఈ.హేమలత 945 (ఒకేషనల్) మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

● **మందస:** మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో 75శాతం సాధించినట్లు ప్రిన్సిపాల్ బచ్చల తేజేశ్వరరావు తెలిపారు. ఎంపీసీలో సునీల్‌గౌడో (951), టి.విష్ణు 935 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో పూజాగౌడో 924 మార్కులు సాధించారన్నారు.

● **కొత్తూరు:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండో సంవత్సరం ఎంపీసీలో పేడాడ కావ్య శ్రీ 933 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించారు.



పావని (962)

● **ఎల్.ఎన్.పేట:** కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఎంఎల్‌టీ కోర్సులో కె.రాజేశ్వరి (925), ఎ.విజయలక్ష్మి (918) మార్కులు సాధించారని ఎస్‌వో ఎంవీ అంబిక తెలిపారు. వీరిని అధ్యాపకులు అభినందించారు.

● **జలుమూరు:** కరవంజ మోడల్ స్కూలులో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్ తెలిపారు. బైపీసీలో జి.పావని (962), ఎంపీసీలో ఆర్.నవ్య 947 మార్కులు సాధించారన్నారు.



వసంతకుమారి (921)

హిరమండలం: హిరమండలం కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం విద్యార్థినులు ఇంటర్‌లో ప్రతిభ కనబరిచినట్లు ప్రత్యేకాధికారి ఎస్.కృష్ణవేణి తెలిపారు. బైపీసీలో ఆర్.వసంత కుమారి 921 మార్కులు సాధించినట్లు చెప్పారు. 26 మంది పరీక్షకు హాజరుకాగా 15 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రథమ సంవత్సరంలో 70.9 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ప్రథమ సంవత్సరం జనరల్ 33 శాతం, ఒకేషనల్ 27.27 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పీఈఎస్ఎన్ పట్నాయక్ తెలిపారు.

● **మెళియాపుట్టి:** మండలంలో శుక్రవారం విడుదలైన ఇంటర్ పరీక్షల్లో ఎస్‌కేకే జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ దయానంద్ తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో గణేశ్వరరావు 451, పి.సరస్వతి, వంశీ 445, టి.మానస బైపీసీ 427, ద్వితీయ సంవత్సరంలో చెల్లి, పవతీకుమార్ ఎంపీసీ 976, ఐ.తనూశ్రీ ఎంపీసీ 964, జె.త్రివేణి 939, జి.పవిత్ర 936 మార్కులు సాధించారన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో నికాంత్ మజ్జి 961, అనికాంత్ మజ్జి 919 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు.

● **నందిగాం:** నందిగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో 80శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఆర్.జనార్దనరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 50మందికి 39 మంది, ప్రథమసంవత్సరంలో 58మందికి 46 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

రాణించిన శాతవాహన విద్యార్థులు



హాసిని (980)

హరిపురం: హరిపురం శాతవాహన కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో రాణించారని ఏవో బిన్నల శివకుమార్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో తామాడ హాసిని 980, బైపీసీలో ఆనల పవిత్ర 955 మార్కులు సాధించినట్లు చెప్పారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో లైశెట్టి అశ్విని 451, బైపీసీలో ఇదం కావ్య 408 మార్కులు సాధించారన్నారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 400 మార్కులు దాటినవారు 13మంది కాగా ద్వితీయ ఫలితాల్లో 900 మార్కులకు పైగా 14 మంది సంపాదించారని, మొత్తం 98 శాతం ఫలితాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించండి

అంపలాం(పోలాకి): పాఠశాల అభివృద్ధికి గ్రామ పెద్దలు, ప్రజలప్రతినిధులు సహకరించాలని ఎస్ఐ సత్యనారాయణ కోరారు. శుక్రవారం అంపలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తల్లిదండ్రులు, విద్యా కమిటీ సమావేశం నిర్వహించారు. హెచ్ఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి విరాళాలందించిన యారబాటి రామారావు, నేతేటి వల్లయ్య నాయుడు, జోగారావు సహకరించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ

జలుమూరు (సారవకోట): కూర్మనాథపురం గౌరీ కేదారేశ్వర ఆలయంలో శుక్రవారం నవగ్రహ విగ్రహాలు ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. వేదపండితుడు వైకుంఠ శర్మ, ధర్మకర్త సత్తారు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు.

టికెట్ రాలేదని బెదిరింపులపై ఫిర్యాదు

పలాస: పలాస అసెంబ్లీ కాంగ్రెస్ టికెట్ రాలేదని, దీనికి కారణం నీవేనంటూ ఓ వ్యక్తి రెండు రోజుల నుంచి బెదిరింపు కాల్స్ చేస్తున్నాడని, తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ వైద్యుడు దువ్వాడ జీవితేశ్వరరావు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై సదరు వ్యక్తి కక్షకట్టుకుని దుర్భాషలాడుతున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

దూకలపాడు మాజీ సర్పంచ్ మృతి

నరసన్నపేట: సత్యవరం రూరల్ పంచాయతీ (దూకలపాడు) మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు బండి అప్పలనర్సయ్య (80) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. సత్య వరం రూరల్ పంచాయతీకి నాలుగు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేశారు. ఈయనకు కుమారుడు, కుమార్తెలున్నారు. అప్పలనర్సయ్య మృతిపట్ల మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తదితరులు సంతాపం తెలిపారు.

ఎంపీటీసీ భర్త...

టెక్కలి: టెక్కలి మేజర్‌పంచాయతీ ఆదీఆంధ్రా వీధి ఎంపీటీసీ దేవాది శాంతామణి భర్త దేవాది గోపి శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సంపద సృష్టించి పథకాలిచ్చేది చంద్రబాబే

● ఎంపీ రామ్మోహన్, టీడీపీ అభ్యర్థి శిరీష



సైకిల్ గుర్తును చూపిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రామ్మోహన్‌నాయుడు, శిరీష

హరిపురం: రాష్ట్రంలో సంపద సృష్టించి పథకాలిచ్చేది చంద్రబాబేనని, రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వానికి మద్దతివ్వాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టీడీపీ పలాస అసెంబ్లీ అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. శుక్రవారం వారు కొండలోగాం పంచాయతీ రామారాయి నుంచి కొయ్యాడూరు, సాపరాయి, కొండలోగాం, పట్టులోగాం, గంద్రుగాం, టంటరుట్టి, కుసుమాల, చినబరంపురం, చీపి మీదుగా పెద్దకోష్ట, బుడార్సింగి, సిద్ధిగాం వరకు రోడ్ షో నిర్వహించారు. సైకిల్ గుర్తు పై ఓటేసి టీడీపీని గెలిపించాలని కోరారు. గిరిజన సంక్షేమం కోసం ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లాకు ఐటీడీఏను తీసుకొచ్చి గిరిజనులకు ఫలాలు అందేలా కృషి చేస్తామన్నారు. అన్ని గ్రామాల్లోనూ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, దాసరి తాతారావు, దువ్వాడ హేమబాబు చౌదరి, సవర లఖియా, రట్టి లింగరాజు, రుద్రయ్య, భాస్కరరావు, అమ్మి నాయుడు, దువ్వాడ లక్ష్మీభార్గవి, జనసేన నాయకులు దుర్గారావు, భాస్కరరావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 'అనపాన'

మెళియాపుట్టి: వైసీపీ నేత, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు అనపాన రాజశేఖర్ రెడ్డి శుక్రవారం టీడీపీలో చేరారు. ఈ మేరకు ఆయనకు టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు పార్టీ కండు వా వేసి ఆహ్వానించారు. వైసీపీలో సరైన గౌరవ లేకపోవడంతో తాను టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకున్నానని తెలిపారు. రాజశేఖర్ రెడ్డి 2009, 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ బలోపేతానికి కష్టపడి పనిచేశారన్న గుర్తింపు కార్యకర్తల్లో ఉంది. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపించాలని గోవిందరావు కోరారు.



రాజశేఖర్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న గోవిందరావు

పట్టణ ప్రజలకు తాగునీరందించాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పలాస, ఏప్రిల్ 12: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారని, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పట్టణ కార్యదర్శి సప్ప నవీన్, జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి టంకాల రవిశంకర్ గుప్తా తదితరులు విలేకరులతో మాట్లాడుతూ.. పది రోజులకు ఒకసారి పబ్లిక్ కొళాయిల ద్వారా నీరందించడంపై ఆందోళన వ్యక్తంచేశారు. నీటి సమస్య అధికంగా ఉన్న వార్డుల్లో ప్రత్యామ్నాయ మార్గా ల ద్వారా నీరందించాలని కోరారు. ప్రతి ఏటా నీటి సమస్యలు తలెత్తుతున్నా వైసీపీ పాలకులు శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. సమగ్ర మంచినీటి పథకం ద్వారా నీరందించే కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. సమా వేశంలో సీనియర్ కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, నేతలు శాసనపురి మురళీకృష్ణ, మల్లా శ్రీనివాస్, డొక్కురి శంకర్ పాల్గొన్నారు.

అమ్మో.. ఆర్టీసీ బస్సా?

● ఆందోళన చెందుతున్న ప్రయాణికులు

మెళియాపుట్టి: ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో తిరుగుతున్న ఆర్టీసీ బస్సులంటేనే ప్రయా ణికులు హడలెత్తిపోతున్నారు. ఎప్పుడు వస్తాయో, ఎక్కడ ఆగిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతిరోజు పలాస నుంచి పర్లాకిమిడి, పాతపట్నం, కొత్తూరు తదితర ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు తిరుగుతున్నాయి. అయితే పలాస-పర్లాకిమిడి అంతరాష్ట్ర బస్సు సర్వీసుల్లో ప్రతి రోజు ఎక్కువ మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త బస్సుల కొనుగోలు లేకపోగా, డొక్కు బస్సులను తిప్పుతున్నారు. ఇవి తరచూ మరమ్మతులకు గురై ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఎదురవుతోంది. తాజాగా శుక్రవారం జోడూరు వద్ద ఆర్టీసీ మరమ్మతుకు గురికావడంతో మిట్ట మధ్యాహ్నం ప్రయాణికులు రోడ్డుపై గంటల తరబడి పడిగాపులు పడాల్సి వచ్చింది.



మరమ్మతుకు గురైన ఆర్టీసీ బస్సు

కార్యకర్తలకు అండగా ఉంటా: కలమట

డొంకలబడవంజ (ఎల్.ఎన్.పేట): టీడీపీ అధిష్ఠానం తనకు టికెట్ కేటాయించకుంటే ఇండిపెండెంట్‌గా పోటీలో ఉంటానని, తనకు వెన్నుదన్నుగా ఉన్న కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. శుక్రవారం ముంగెన్న పాడు, మోదుగవలస, డొంకల బడవంజ, బొర్రంపేట, దబ్బపాడు, కృష్ణాపురం తదితర గ్రామా ల్లో పర్యటించి నాయకులను, కార్యకర్తలను కలిశారు. పార్టీ ఆవిర్భావం నుంచి తన తండ్రి మోహనరావు, తాను పార్టీని నమ్ముకుని పార్టీ బలోపేతానికి కృషి చేశామన్నారు. అయితే ఈ పర్యాయం నమ్మించి టికెట్ ఇవ్వ కుండా చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. నాయకు లు, కార్యకర్తలు తనపై నమ్మకం ఉంచి పనిచేశారని, వారికి అన్యాయం జరగకుండా ఉండేం దుకు స్వతంత్రంగా పోటీ చేస్తానన్నారు. కార్యక్రమంలో నేతలు ఎం.మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి, ఎస్.కిశోర్‌కుమార్, వి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరమణమూర్తి

గ్రామ అవసరాలకే తాగునీరు

● యామాలపేట వాసుల తీర్మానం

సంతబొమ్మాళి: గ్రామాల అవసరం మేరకు వ్యవసాయ బోర్ల నుంచి నీటిని వాడుకో వాలని, బోర్ల నుంచి పోర్టుకు, ఇతర కార్యక్రమాలకు అమ్ముకోవద్దని యామాలపేట గ్రామ సభలో తీర్మానించారు. గ్రామ సమీపంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న ఎస్ఎస్ కంపెనీలో గ్రామస్థులు సుమారు 200 ఉపాధి పొందుతుండున్నందున ఆ కంపెనీకి మినహాయించాలని నిర్ణయించారు. ఈ మేరకు తీర్మానం కాపీని ఎంపీడీవోకి పంపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కేశవ, ఉప సర్పంచ్ జగన్నాథరావు, సంజీవ్ పాల్గొన్నారు.

రేపు అయ్యప్ప స్వామి జయంతి

మందస: మందస బొట్టేశ్వర ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్ప జయంతిని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

నేడు మేష సంక్రమణ పూజలు

పలాసరూరల్: స్థానిక జగన్నాథస్వామి ఆలయంలో శనివారం మేష సంక్రమణ పూజలు, హోమం నిర్వహించనున్నట్లు జైజగన్నాథ్ ఒడియా బ్రాహ్మణ సంఘ కార్యదర్శి బాబూరావు పండా తెలిపారు. సంఘం ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

వివాహిత ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైం: కొన్నాళ్లగా మానసికంగా బాధపడుతున్న ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక డీసీసీబీ కాలనీ నివాసం ఉంటున్న కింతలి శ్రీవాణి(30)కి నెల్లూరుకు చెందిన హరీష్‌కుమార్‌తో 2020లో వివాహం జరిగింది. భర్తతో పాటు హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుంది. ఇటీవల ఉగాది సందర్భంగా భర్తతో పాటు కన్నవారింటికి శ్రీకాకుళం వచ్చింది. అయితే శుక్రవారం ఉదయం భర్త, తండ్రి భయటకు వెళ్లిన సందర్భంలో చిన్న చెల్లెలు లోకేశ్వరి తన మరో అక్క కుమార్తెతో ఆడుకుంటుండగా.. శ్రీవాణి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గదిలోకి వెళ్లిన అక్క ఎంతకి బయటకు రాకపోవడంతో లోకేశ్వరి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దీంతో తండ్రి తవిటి నాయుడుకు, బావకు సమాచారం ఇవ్వగా, వారు వెంటనే ఇంటికి చేరుకుని రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ వాసుదేవరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తండ్రి తవిటినాయుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు. అయితే గత కొంతకాలంగా శ్రీవాణి మానసికంగా బాధపడు తుందని చికిత్స కూడా తీసుకుంటున్నట్టు తండ్రి పోలీసులకు తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూసుకోండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: వేసవిలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులతో తాగునీటి ఎద్దడి, ఉపాధి హామీ పనులు, విద్యుత్తు సరఫరా తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రణస్థలం, ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో భూగర్భ జలాల లభ్యతపై ఆరా తీశారు. నీటి నాణ్యతా పరీక్షలు నిర్వహించాలని, గ్రామీణ, పట్టణ తేడా లేకుండా తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద పెంచిన వేతనం రూ.300తో వేతనదారుకు ఏడాదికి 100 పనిదినాలు కల్పించాలని, జిల్లాలోని 1.82లక్షల మందికి లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలీలకు టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీటిని అందుబాటులో ఉంచాలని, ఎంపీడీవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. వేసవిలో విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉంటుందని, డిమాండ్‌కు తగ్గ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్తుశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో డి.వెంకటేశ్వరరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, డీపీవో వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ చిట్టిరాజు, వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమల రావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఇంజినీర్ పొగిరి సుగుణాకరరావు, ఆయా మండలాల నుంచి ఎంపీడీవోలు, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

కలెక్టరేట్: తొలి విడత ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్దేశిత వెబ్‌సైట్‌లో పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియ చేపట్టినట్టు తెలిపారు. డీఆర్వో ఎం.గణపతిరావు, ఈవీఎంల నోడల్ అధికారి, జిల్లా ఉపాధికల్పనా అధికారి కె.సుధ, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ జయప్రకాష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

15 నుంచి ఆదిత్యుని కల్యాణోత్సవాలు

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ఏటా నిర్వహించే స్వామివారి వార్షిక కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికలను ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మతో పాటు పాలకమండలి సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ చైత్ర శుద్ధ సప్తమి సోమవారం సాయంత్రం 5.30 గంటలకు 'కల్యాణాంగ ధ్వజారోహణం' పతాకావిష్కరణ, 18న చైత్ర శుద్ధ దశమి గురువారం రాత్రి 7.30గంటలకు సుగంధ ద్రవ్య మర్ధన (కొట్నం దంపు), 19న చైత్ర శుద్ధ ఏకాదశి శుక్రవారం రాత్రి 7.00 గంటలకు అశ్వ వాహనంపై ఉత్సవమూర్తులకు తిరువీధి మహోత్సవం అనంతరం రాత్రి 9.00 గంటలకు ఉషా, పద్మిని, ఛాయా దేవీలతో స్వామివారికి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. 20న ద్వాదశి శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఆగ్నేయ స్థాలీపాక హోమాదులు, విశేష భోగములు, అనంతరం 6.30 గంటలకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 21వ తేదీ ఆదివారం రాత్రి 8.30 గంటలకు సదస్యం, మహదాశీర్వచనములు, వేద సదస్సు, పండితులకు సత్కారం ఉంటుందన్నారు. అదే రోజు సాయంత్రం 4.00 గంటలకు రథోత్సవం, మంగళ హారతులు నిర్వహించనున్నట్టు చెప్పారు. 22వ తేదీ సోమవారం రాత్రి 7 గంటలకు తిరువీధి, ఉద్యాన వనంలో తిరుమంగయాళ్వారుల చరిత్ర సంవాదం, హారతి, ప్రాసద వితరణ ఉంటుందన్నారు. 23వ తేదీ మంగళవారం ఉదయం 7.50 గంటలకు సుమంగళి అర్చన, నీలమణి ధారణ, నాకబలి ప్రయుక్త చక్రతీర్థ స్నానం, సాయత్రం ధ్వజారోహణం, రాత్రి 7.15 గంటలకు పుష్పయాగ మహోత్సవం, విశేష అర్చన అనంతరం ఏకాంతసేవ, ఉత్సవ సంప్రదాయ కీర్తనల ఆలాపనతో స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు ముగుస్తాయని స్పష్టం చేశారు.

ఒకే ఈతలో రెండు దూడలు



లేగ దూడలతో రైతు

జి.సిగడాం: పెంట గ్రామానికి చెందిన పాడి రైతు పున్నాన సత్యనారాయణకు చెందిన ఆవుకు శుక్రవారం రెండు లేగ దూడలు జన్మించాయి. మొదట మగలేగ దూడ పుట్టగా, మరో గంట వ్యవధిలో ఆడ లేగదూడ జన్మించింది. సాధారణంగా ఒక లేగదూడే పుడుతుంది. కాగా తొలుత ఒక దూడ జన్మించిన తర్వాత సత్యనారాయణ దాణా కోసం ఇంటికి వచ్చి, తిరిగి వెళ్లే సరికి మొరొక లేగదూడ పుట్టడంతో ఆ రైతు ఆశ్చర్యానికి గురయ్యాడు.

ఓట్ ఫర్ హోమ్‌పై వీడియో కాన్ఫరెన్స్

జి.సిగడాం: ఓట్ ఫర్ హోంపై శుక్రవారం అధికారులకు కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 85 ఏళ్ల వయసు దాటి బయటకు రాలేని వృద్ధులతో పాటు దివ్యాంగుల ఇంటి వద్దకు వెళ్లి ఓటు వేయించాలన్నారు. స్థానిక బీఎల్‌వో స్థాయి అధికారి సహాయంతో ఎన్నికల పోలింగ్ అధికారి, ఎన్నికల సిబ్బంది ఇంటి వద్దే ఓటు వేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణపై అవగాహన కల్పించారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఉమామహేశ్వరరావు, ఏఈలు ఎం.రమేష్, శ్రీవల్లి, భాగ్యలక్ష్మి, ఎంఈవో ఆరసాడ రవి, బీఎల్‌వోలు ఎం.వేణుగోపాల్, ఎరకయ్య తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

సోంపేట: పలాసపురం గ్రామంలో దత్తాత్రేయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం కార్యక్రమం ఘనంగా జరుగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం మహిళల సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటర్‌లో మెరిసిన విద్యార్థులు



సిరివెన్నెల సరితా నాయక్

కంచిలి: ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ఫలితాలలో కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో మోడల్ పాఠశాలలో 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 80శాతం మంది ఉత్తీర్ణత సాధించగా, వీరిలో ఎంపీసీ నుంచి పిల్ల కావ్య 976, బత్తుల సోనీ 953, గొర్ల మానస 952 మార్కులు, బైపీసీ విభాగంలో మట్ట డిల్లేశ్వరి 959, రావాడ ధనలక్ష్మి 947 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మొదటి సంవత్సరంలో 64 శాతం, ద్వితీయ సంవత్సరంలో 56శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఎంపీసీలో సిరివెన్నెల 961, సరితా నాయక్ 953, బైపీసీ నుంచి శ్రీదేవి బెహరా 942 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ వి.జగదీష్ తెలిపారు.

జి.సిగడాం కేజీబీవీలో..

జి.సిగడాం: ఇంటర్ ఫలితాల్లో స్థానిక కేజీబీవీ విద్యార్థులు ప్రతిభ చూపారు. మొదటి ఏడాది విద్యార్థులు 36 మందికి 19 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 31 మందికి 26 మంది ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల ప్రత్యేకాధికారి ఉషారత్నకుమారి తెలిపారు. అలాగే స్థానిక ఆదర్శ పాఠశాలలో మొదటి సంవత్సరంలో 92 మంది విద్యార్థులకు 73 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండో ఏడాదిలో 83 మంది విద్యార్థులకు 65 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకెండియర్ ఎంపీసీలో డి.మేఘన 949, బైపీసీలో వైవీ రమణి 943, సీఈసీలో కె.వసంత 932 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ అన్నా శ్యామ్యూల్ లెంక తెలిపారు.

బూర్జ ఆదర్శ పాఠశాలలో..

బూర్జ: ఇంటర్ ఫలితాల్లో బూర్జ ఆదర్శ పాఠశాలు ప్రతిభ చూపారు. మొదటి ఏడాది చదువుతున్న 106 మంది విద్యార్థులకు 59 మంది ఉత్తీర్ణలయ్యారు. కె.ధరణి 461 మార్కులు వచ్చాయి. రెండో ఏడాదిలో అల్లు మౌనిక 973 మార్కులు సాధించింది. విద్యార్థులను ప్రిన్సిపాల శ్రీనివాసరావు అభినందించారు.

కవిటి మండలంలో..

కవిటి: రాజపురంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. ఫస్ట్ ఇంటర్‌లో 55 శాతం ఉత్తీర్ణత సాధించగా, సెకెండియర్ ఇంటర్‌లో 65 శాతం ఫలితాల్లో ఎంపీసీలో కె.రేష్మ 867, బైపీసీలో రుతు దొళాయి 940 మార్కులు సాధించారు. కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 126 మందికి 78మంది ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ పి.రాజేశ్వరరావు తెలిపారు. మొదటి సంవత్సరంలో 108మందిరి 48మంది పాసయ్యారన్నారు.

సోంపేట మోడల్ స్కూల్‌లో..

సోంపేట: మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో ఆట్ల వర్ధిని 458/470 మార్కులు సాధించగా, బైపీసీలో బూరగాపు మౌనిక 380/440 సాధించింది. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ ఇరోతు ప్రియా 958/1000 మార్కులు, బైపీసీలో గెదేల భూమిక 918/1000 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. బారువ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం సీఈసీలో కొండా మీనాక్షి 478/500 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ ఆర్‌జీ మహేష్ తెలిపారు.



ఇరోతు ప్రియా

ఇచ్ఛాపురంలో..

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం విద్యార్థులు ఫస్టియర్ ఎంపీసీలో పి.బిందురెడ్డి 457, కె.లక్ష్మి 439 మార్కులు, బైపీసీలో వసంత్ బెహరా 402, చిన్ని 395 మార్కులు సాధించారు. సెకెండియర్ ఎంపీసీలో రాఖీ బెహరా 942, పి.ప్రసన్న 939 మార్కులు, బైపీసీలో వి.అంజలి 958, పూజా బెహరా 946మార్కులు సాధించారు. ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో కె.రోజా 386మార్కులు, బైపీసీలో బి.లలిత 376 మార్కులు సాధించారు. సెకెండియర్ ఎంపీసీ గ్రూప్‌లో కె.కుసుమ 947, బైపీసీ గ్రూప్‌లో ఎస్.రూప 930 మార్కులు సాధించారు.

మోడల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

రణస్థలం: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కె.సుజాత 980, కె.గాయిత్రి 975 మార్కులు సాధించారు. అదేవిధంగా బైపీసీలో సీహెచ్ రూప 917, ఎస్.భువనేశ్వరి 858 మార్కులు సాధించారు. సీఈసీలో జి.అశోక్ 892, డి.శ్రీను 738 మార్కులు సాధించాడు. మొదటి సంవత్సరం ఎంపీసీలో ఎస్.దివ్య 458, బైపీసీలో ఆర్.అణుశ్రీ 410 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌ఈసీలో జి.సింహాచలం 916 మార్కులు, బైపీసీలో గొర్లె లావణ్య 912, ఎంపీసీలో ఎన్.సత్యప్రియ 784, ఒకేషనల్‌లో ప్రేమకుమరి 749 మార్కులు సాధించారు.

సరుబుజ్జిలిలో..



చాందిని

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బొడ్డేపల్లి సాయిరాజ్ 923 (ఎంపీసీ), జి.చాందిని 951 (బైపీసీ) మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు తెలిపారు. ఒకేషనల్ గ్రూప్‌లో సవర రాజు 903 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు.

ఐటీడీఏ విద్యార్థులు..

గుజరాతీపేట: ఇంటర్ ఫలితాల్లో సీతంపేట ఐటీడీఏ పరిధిలో చదువుతున్న విద్యార్థులు ప్రతిభ చూపారు. ద్వితీయ సంవత్సరంలో సవర సుజాత (959), నిమ్మల హర్షవర్ధన్ ((953), కొత్తూరు ఉపేంద్ర (946)తో పాటు 12 మంది విద్యార్థులు 900 పైబడి మార్కులు సాధించారు. అలాగే జిల్లాలోని తొమ్మిది ఏపీఎస్‌డబ్ల్యూఆర్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ ఇంటర్‌లో 536 మందికి 450 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సంలో 540కి 390 మంది ఉత్తీర్ణులయ్యారు.

కూటమి విజయంతోనే అభివృద్ధి: ఎన్ఈఆర్



మాట్లాడుతున్న ఎన్ఈఆర్

రణస్థలం: కూటమి అభ్యర్థుల విజయంతోనే రాష్ట్రాభివృద్ధి పూర్తిస్థాయిలో సాధ్యమని ఎచ్చెర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం, కుప్పిలి, కొయ్యాం, బడివానిపేట, డి.మత్స్యలేశం, అజ్జరాం తదితర గ్రామాల్లో శుక్రవారం ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకలుఉ చౌదరి నారాయణమూర్తి, పైడి వేణుగోపాలం, విశ్వక్సేన్, బెండు మల్లేశ్వరరావు, బల్లాడ అరుణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే శుక్రవారం దేరసాం పంచాయతీ పరిధిలో ఎచ్చెర్ల నియోజకవర్గం కూటమి అభ్యర్థి ఎన్ఈఆర్ సతీమణి రజిని పర్యటించి ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు దనాన్న లక్ష్మణరావు, పిసిని లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు కొత్త వైభవం తెస్తా: శంకర్



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గొండు శంకర్

అరసవల్లి: అన్ని వార్డుల్లో సమస్యలను పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించి శ్రీకాకుళం కార్పొరేషన్‌కు కొత్త వైభవం తీసుకొస్తానని కూటమి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది గడవక ముందే కార్పొరేషన్‌కు ఎన్నికలు నిర్వహించి పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తామన్నారు. శుక్రవారం నగరంలోని 25వ డివిజన్‌లో కోరాడ హరగోపాల్, పిరియా మాధవి ఆధ్వర్యంలో బాబు సూపర్ సిక్స్ పథకాల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాండ్రంకి శంకర్, చల్లా శ్రీనివాసరావు, అంబటి లక్ష్మీరాజ్యం, సకలాబత్తుల శ్రీనివాసరావు, మైలపల్లి నర్సింహమూర్తి, రెడ్డి గిరిజా శంకర్, కోరాడ రమేష్, పద్మావతి, శత్రుఘ్నుడు, పిరియా బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అలాగే కసిమివలస గ్రామానికి చెందిన 30 కుటుంబాలు గొండు శంకర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. తన కార్యాలయంలో వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

- **గార:** ఆరంగిపేటలో కూటమి అభ్యర్థి గొండు శంకర్‌ను గెలుపించాలని కోరుతూ అతని సతీమణి స్వాతి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పీస వెంకటరమణ మూర్తి, గుండ భాస్కరరావు, బడగల వెంకటప్పారావు, సర్పంచ్ కె.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు



టీడీపీలో చేరినవారితో పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

బూర్జ: నీలంపేట, కొరగాం, చీడివలస గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. నీలంపేట నుంచి పది కుటుంబాలు, కొరగాం పంచాయతీ నుంచి 50 కుటుంబాలు, చీడివలస పంచాయతీ నుంచి మూడు కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. కురుంపేట గ్రామంలో కత్తెర అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు వేల మజ్జిగ ప్యాకెట్లను కూన రవికుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇదే గ్రామంలో కులవృత్తి చేసుకుని జీవనం పొందుతున్న వెంకటేష్ తమ సమస్యలను వివరిస్తూ రవికుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వ ప్రసాద్, మాజీ జడ్పీటీసీ ఆనెపు రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి సీతారాంబాబు, లంక జగన్నాథంనాయుడు, మొదలవలస రమేష్, కోడి గోవిందరావు, అంపిలి గణపతి, గన్ని రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ శంఖారావం

పొందూరు: మండల కేంద్రం పొందూరులో శనివారం శంఖారావం పేరుతో నిర్వహించనున్న ఎన్నికల ప్రచార కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ కోరారు. శనివారం ఉదయం 7.30 గంటలకు ప్రారంభించే ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి కూన రవికుమార్ పాల్గొంటారని తెలిపారు.

వలంటీర్ల రాజీనామాలు బహిర్గతం చేయండి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఆమదాలవలస: నియోజకవర్గం పరిధిలో వలంటీర్లు చేసిన రాజీనామాలను సంబంధిత అధికారులు బహిర్గం చేయాలని టీడీపీ న్యాయ విభాగ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లు రాజీనామా చేసినట్టు ప్రకటించి వైసీపీ తరపున ప్రచారంలో పాల్గొంటున్నారన్నారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ తక్షణమే ఎంతమంది వలంటీర్లు రాజీనామాలు చేశారు, వాటిని ఆమోదించిన విధానాన్ని నోటీసు బోర్డు ద్వారా బహిర్గతం చేయాలని, లేకుంటే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. వలంటీర్లు రాజకీయ పార్టీలకు వత్తాసు పలికి, భవిష్యత్తులో టీడీపీ ప్రభుత్వం అందించనున్న రూ.10 వేలుతో ఉపాధి అవకాశాలు కోల్పోవద్దని హితువు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, సనపల డిల్లేశ్వరరావు, తంగి గురయ్య మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ నవీన్

పొందూరు: సమస్యలు లేకుండా ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జాయింట్ కలెక్టర్, ఆమదాలవలస రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్ చెప్పారు. తుంగపేట పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అధికారులు ముందుగానే చర్యలు చేపట్టాలని, నగదు, మద్యం అక్రమ రవాణా జరుగకుండా చెక్ పోస్టులను బలోపేతం చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ ఎం.పాల్‌కిరణ్, ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ, ఎంఈవో రామరాజు తదితరులు ఉన్నారు.

భానుడి తాపం.. మూగజీవాలు విలవిల



మర్రివలస గ్రామ సమీపంలో చెట్ల కింద ఉపశమనం పొందుతున్న గొర్రెలు

జి.సిగడాం: భానుడి తాపానికి మూగజీవాలు సైతం విలవిలాడిపోతున్నాయి. ఎండ వేడిమికి తట్టుకోలేక చెట్ల కింద సేదతీరుతున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు బయటకు రాలేకపోతున్నారు. మేత కోసం వచ్చిన మూగజీవాలు ఇలానీడకు చేరి ఉపశమనం పొందుతున్నాయి.

నిజాయితీగా ఓటువేద్దాం

ఆమదాలవలస: ఈ ఏడాది మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నైతిక విలువలు పాటించి నిజాయితీగా ఓటు వేద్దామని మండల ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు మహిళా సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం తురకపేట, వెదుర్లవలస, బొబ్బిలిపేట తదితర గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్స్ సుభద్ర, రామప్పడుతో పాటు అధ్యక్షురాలు నక్క లత, వీవోఏ రాజకుమారి పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయంలో చండీయాగం



చండీ యాగం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో గల సంతోషిమాత అమ్మవారి ఆలయంలో లోకకల్యాణార్థం శుక్రవారం చండీయాగం నిర్వహించారు. ఆలయ అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ ఆధ్వర్యంలో సహిత సహస్ర ఘటాభిషేకం, పంచాయతన యాగం మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. షిర్డీ సాయి భక్తి రంజని ఆధ్వర్యంలో భక్త సంగీత విభావరి నిర్వహించారు.

డ్రోన్ టెక్నాలజీతో ప్రయోజనం

ఎచ్చెర్ల: అన్ని రంగాలకు విస్తరించిన డ్రోన్ టెక్నాలజీతో ఎంతో ప్రయోజనమని ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న టెక్‌ఫెస్ట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ, వైద్య, భద్రత రంగాలతో పాటు వరద సమయాల్లో కూడా డ్రోన్ టెక్నాలజీ ఉపకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ ఏవో ముని రామకృష్ణ, ఫెస్ట్ కన్వీనర్ వాసు, కో కన్వీనర్ దిలీప్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రమణ, తిరుపతమ్మ, పీఆర్వో మామిడి షన్ముఖ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



బూర్జ: రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రాధిక

బూర్జ: చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. మదనాపురం వద్ద సరిహద్దు చెక్ పోస్టును ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో శ్రీకాకుళం-పాలకొండ రహదారి మార్గంలో వస్తున్న వాహనాలను పక్కాగా తనిఖీ చేయాలన్నారు. తనిఖీ చేస్తున్న తీరు, వీడియో రికార్డులు చేస్తున్న విధానంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

- **సరుబుజ్జిలి:** మతలబుపేట పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం ఎస్పీ జీఆర్ రాధిక పరిశీలించారు. తొలుత స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు పరిశీలించారు. రానున్న ఎన్నికలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యాత్మ, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏఎస్ఐ చంద్రినాయుడు, సిబ్బంది ఉన్నారు.

నేడు స్వీప్‌పై సంతకాల సేకరణ

కలెక్టరేట్: స్వీప్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద కలెక్టర్ మన్‌జీర్ జిలాని సమూన్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ జరుగుతుంది. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు, తమ సిబ్బందితో సహా హాజరుకావాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పోలీసులకు మజ్జిగ పంపిణీ

శ్రీకాకుళం: మండు టెండల్లో విధులు నిర్వహించే పోలీసులకు తమవంతు సేవగా జిల్ ఫౌండేషన్ సాయి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ శుక్రవారం చేపట్టారు. ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులతో పాటు స్టేషన్‌లో విధులు నిర్వహించే పోలీసులకు ఫౌండేషన్ సభ్యులు చల్లని మజ్జిగ ప్యాకెట్లను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు జాడ సాయి మాట్లాడుతూ నిరంతర సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు సేవలందించే పోలీసులకు వేసవి తాపాన్ని తీర్చేందుకు గాను ఈ మజ్జిగ పంపిణీ చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు శివతేజ తదితరులు పాల్గొన్నారు

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సోంపేట: బారువ సబ్‌స్టేషన్ పరిధిలో బారువ, గొల్లగండి, చాపలగొల్లగండి, కొర్లాం, లక్ష్మవరం, పలాసపురం, బెంకిలి, జింకిభద్ర గ్రామాలకు ఆదివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.రామారావు తెలిపారు. బారువ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో ఈ అంతరాయం కలుగుతుందని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

దుష్ప్రచారాలను తిప్పికొట్టండి

శ్రీకాకుళం అర్బన్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్షాలు రాష్ట్రాన్ని వైసీపీ నాశనం చేసిందని దుష్ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి ప్రచారాలను నమ్మవద్దని, అందరూ దీనిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక 80 అడుగుల రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన ఉమ్మడి జిల్లాల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని గడప గడపకు తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో వైసీపీని గెలిపించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు.

ఎడెక్స్ కోర్సులపై సమీక్ష

ఎచ్చెర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఎడెక్స్ కోర్సులపై రాష్ట్ర ఉన్నత విద్యామండలి శుక్రవారం వర్చువల్ విధానంలో సమీక్షించింది. ఎడెక్స్ కోర్సులో పూర్తిస్థాయిలో విద్యార్థుల చేరికతో పాటు అవగాహన పెంచాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ ఉమామహేశ్వరి సూచించారు. బీఆర్‌ఏయూ పరిధిలో మూడు వేల మంది వరకు విద్యార్థులు ఈ కోర్సులో తమ పేర్లను నమోదు చేసుకున్నట్టు వర్సిటీ అధికారులు వివరించారు. బీఆర్ ఏయూ వీసీ కేఆర్ రజని, రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయ భాస్కర్, రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటర్లను గుర్తించండి

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇంటింటా సర్వే చేపట్టి హోం ఓటర్లను గుర్తించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలు, సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో 4,674 మంది హోమ్ ఓటర్లు ఉన్నారని, వీరందరిపై ఇంటింటా సర్వే చేపట్టి అర్హులను గుర్తించి నివేదికలు మూడు రోజుల్లో అందించాలని ఆదేశించారు.

పోషకాహారాన్ని తీసుకోవాలి

సరుబుజ్జిలి: గర్భిణులు పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని అక్కులపేట పీహెచ్‌సీ వైద్యురాలు మీనాకుమారి అన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ యోజన పథకంలో భాగంగా శుక్రవారం 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. అనంతరం వేణమ్మపేట, అక్కులపేట శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అమృత ఆహారాన్ని ఆమె ప్రారంభించారు. సీమంత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ జోనల్ కన్వీనర్ ఎం.జనార్దన రావు, జిల్లా జాయింట్ యూత్ కో-ఆర్డినేటర్ సాయికృష్ణ, సమితి ముఖ్య కార్యకర్తలు శ్రీదేవి, అరుణ, కుమారి, రమణమ్మ, లక్ష్మీ, సాయిడిల్లీ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

గార: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా ప్రతీ ఒక్కరూ సహకరించాలని సీఐ ఎల్.సన్యాసి నాయుడు కోరారు. శుక్రవారం రాత్రి శ్రీకూర్మం పంచాయతీ సెగిడిపేటలో ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. తగాదాలకు దూరంగా ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.